# అత్తాపూర్‌లో కన్నుల పండుగగా జగన్నాథ రథయాత్ర!


- అత్తాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఐదవసారి ఘనంగా జగన్నాథ రథయాత్ర
- అత్తాపూర్ ఇస్కాన్ నుండి ఎస్ఎన్సీ కన్వెన్షన్ వరకు సాగిన యాత్ర
- 10,000 మందికి పైగా భక్తులు భక్తిశ్రద్ధలతో యాత్రలో పాల్గొన్నారు
- భక్తులు స్వయంగా రథాన్ని లాగుతూ భగవంతుని సేవించుకున్నారు
- నృత్యాలు, కీర్తనలతో అత్తాపూర్ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది





ఇది కద నిజం, అత్తాపూర్: అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్ర దేవి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుక ఐదవసారి నిర్వహించబడటం విశేషం. భక్తి పారవశ్యంతో సాగిన ఈ రథయాత్ర భక్తులకు కన్నుల పండుగగా నిలిచింది. ఈ రథయాత్ర మహోత్సవం ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల కోలాహల నృత్యాలు, కీర్తనలు, మంత్రోచ్చారణలతో అత్తాపూర్ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా భక్తులకు మహాప్రసాద వితరణ కూడా ఘనంగా నిర్వహించారు. ఈ రథయాత్ర 2026 జూలై 18, శనివారం నాడు ఇస్కాన్ అత్తాపూర్ మందిరం నుండి ప్రారంభమైంది. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ శోభాయాత్ర ఎస్ఎన్సీ (SNC) కన్వెన్షన్ వరకు కొనసాగి, అక్కడ ముగిసింది. ఈ కార్యక్రమంలో పది వేల మందికి పైగా భక్తులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. భక్తులు తమ స్వహస్తాలతో రథాన్ని లాగుతూ, భగవంతుని తమ గుండెల్లోకి ఆహ్వానించారు. భక్తితో భగవంతుని సేవించుకుంటూ తమ జీవనాన్ని ధన్యం చేసుకున్నారు. ఈ అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే ఈ రథయాత్ర మహోత్సవంలో ఇదేవిధంగా భక్తులందరూ పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో జెప్టో డెలివరీ బాయ్ మృతి



ఇది కద నిజం, నార్సింగి:హైదరాబాద్ శివారులోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువ డెలివరీ బాయ్ దుర్మరణం పాలయ్యాడు. జెప్టో డెలివరీ సంస్థలో పనిచేస్తున్న రహమత్ అన్సారీ (19) అనే యువకుడు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయాడు. గోల్కొండ కిలా, ఫిల్ఖానా ప్రాంతానికి చెందిన రహమత్ అన్సారీ, తన ఎలక్ట్రిక్ బైక్ (TG08BA6852) పై డెలివరీ నిమిత్తం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పుప్పాలగూడ పైప్‌లైన్ రోడ్డులోని హీరో షోరూమ్ సమీపంలోకి రాగానే, వెనుక నుండి వేగంగా వచ్చిన వాటర్ ట్రాక్టర్ (TS07UL1772) అతని బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రహమత్‌ను స్థానికులు వెంటనే హుటాహుటిన భూమి ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడు రహమత్ అన్సారీ తండ్రి మతీన్ అన్సారీ అని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే నర్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన వాటర్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

## నూతన విద్యుత్ ఏఈగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 20: కామారెడ్డి జిల్లా పిట్లం విద్యుత్ సెక్షన్ నూతన అసిస్టెంట్ ఇంజినీర్‌గా ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను సకాలంలో పరిష్కరించి, శాఖ సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు ప్రమోద్ రెడ్డి, గంగాధర్, శివ దయాళ్‌తో పాటు లైన్‌మెన్లు దేవి సింగ్, సుదర్శన్, భరత్, రవి, నరేష్, లింగం, సాయిలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తపస్ సమరశంఖం

- రాజేంద్రనగర్‌లో తపస్ మహా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ
- ఆగస్టు 1న మహా ధర్నా




ఇది కద నిజం, రాజేంద్రనగర్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరియు పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా, రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 1న ఇందిరా పార్కులో నిర్వహించనున్న 'మహా ధర్నా'కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జూపల్లి శ్రీనివాసరావు, తపస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కె. హనుమంత్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంజరి బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస రెడ్డి, మండల మహిళా కన్వీనర్ విజయమ్మ, ఉపాధ్యక్షురాలు నాగరాణి తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ప్రధాన డిమాండ్లలో భాగంగా, ప్రభుత్వం వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 6 డిఎలను క్లియర్ చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను సత్వరం చెల్లించాలని కోరారు. అలాగే, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు, ఎస్ఎస్ఏ మరియు కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎం.టి.యస్ మంజూరు చేయడం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు అమలు, జిహెచ్ఎం స్థాయి ప్రమోషన్లకు ప్రత్యేక కార్యాచరణ వంటి అంశాలను ప్రస్తావించారు. గురుకుల, గిరిజన ఆశ్రమ మరియు ఎయిడెడ్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కోసం జూన్ మొదటి వారంలోనే గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. చివరగా, ప్రతి ఏటా ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయడం, 190 జిఓ ప్రకారం అప్పీల్ చేసుకున్న వారికి ఉత్తర్వులు ఇవ్వడం, 2008 డిఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ మరియు టెట్ అర్హత మార్కులను 40 శాతానికి కుదించాలని తపస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: బాన్సువాడ నుంచి సంగారెడ్డి అంగడికి పశువులను అక్రమంగా తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పిట్లం మండలం చిన్నకోడప్ గల్ వద్ద ఈరోజు ఉదయం మహేంద్ర ట్రాలీ ఆటోలో పశువులను తీసుకుపోతుండగా పిట్లం పోలీసులు అట్టి వాహనాలు ఆపి తనిఖీ చేయగా అట్టి వాహనం నందు తొమ్మిది పశువులను ఇరుకు ఇరుకుగా పెట్టి కలవు. అందులో రెండు బర్రె దూడలు, రెండు ఎడ్లు, మూడు ఆవులు మరియు రెండు ఆవు దూడలు కలవు. వాటిని తరలిస్తున్న డ్రైవరు తలాటి సంతోష్, అట్టి వాహన ఓనరు పోల్కంపల్లి శేఖర్ మరియు వాటిని తరలిస్తున్న మహమ్మద్ మునీర్ ల పై కేసు నమోదు చేయడం జరిగింది.

# క్రియేటర్స్ కలెక్ట్ 2026 ఘన విజయంతో హ్యామ్‌స్టెక్ సృజనాత్మక విద్యలో ఒక కొత్త ప్రమాణం







ఇది కద నిజం:హ్యామ్‌స్టెక్ తమ విద్యార్థుల సృజనలను ప్రదర్శిస్తూ, భవిష్యత్తుకు సిద్ధమైన విద్య, ఏఐ-ఆధారిత అభ్యాసం మరియు పరివర్తనాత్మక కెరీర్ కార్యక్రమాలను ఆవిష్కరించగా, 10,000 మందికి పైగా సందర్శకులు హైదరాబాద్‌లో జరిగిన అతిపెద్ద సృజనాత్మక వేడుకను వీక్షించారు. హ్యామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026 అద్భుతమైన విజయంతో, హ్యామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ హైదరాబాద్‌ను ఆవిష్కరణ, స్ఫూర్తి మరియు అపరిమిత అవకాశాల యొక్క శక్తివంతమైన కేంద్రంగా మార్చింది, తద్వారా సృజనాత్మకత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉల్లా మరియు ప్రఖ్యాత సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్‌తో పాటు, ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు, ఇంటీరియర్ డిజైనర్లు, ఫోటోగ్రాఫర్లు, గ్రాఫిక్ డిజైనర్లు, మేకప్ ఆర్టిస్టులు హాజరయ్యారు.విద్యార్థుల ప్రతిభను ప్రశంసించడమే కాకుండా, హ్యామ్‌స్టెక్ తన 30 ఏళ్ల ప్రయాణంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పరివర్తనలలో ఒకదానిని ఆవిష్కరించింది. ఇది సృష్టికర్తలను కేవలం నేటి పరిశ్రమలకే కాకుండా రాబోయే సంవత్సరాలకు కూడా సిద్ధం చేయాలనే తన దార్శనికతను పునరుద్ఘాటించింది. సృజనాత్మక ప్రపంచంలో వేగంగా జరుగుతున్న పరిణామాలను గుర్తించి, హ్యామ్‌స్టెక్ తన ఏఐ-సమ్మిళిత పాఠ్యప్రణాళికను ప్రవేశపెట్టింది. విద్యకు అతీతంగా, హామ్‌స్టెక్ తన 'లైఫ్‌టైమ్ కెరీర్ సపోర్ట్' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా ప్రతి విద్యార్థి పట్ల తమ నిబద్ధత కొనసాగుతుందని ఇది పునరుద్ఘాటిస్తుంది. ఉద్యోగం, నాయకత్వ పాత్రలు లేదా వృత్తిపరమైన ఉన్నతి కోసం ప్రయత్నిస్తున్నా, హామ్‌స్టెక్ తన పూర్వ విద్యార్థులకు వారి వృత్తి ప్రయాణంలోని ప్రతి దశలోనూ మద్దతునిస్తూనే ఉంటుందనీ నిర్వాహకులు తెలిపారు. సినీ నటుడు విశ్వక్ సేన్ గౌరవ అతిథిగా ఈ కార్యక్రమానికి విచ్చేసి, విద్యార్థులతో ముచ్చటించి, వారి అద్భుతమైన కృషిని అభినందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'కల్ట్' చిత్రం నుండి "హి ఈజ్ మై దోస్త్" పాటను చిత్ర బృందంతో కలిసి ఘనంగా విడుదల చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, హ్యామ్‌స్టెక్ సీఈఓ అజిత యోగేష్, సృజనాత్మక విద్య యొక్క భవిష్యత్తుపై తమ సంస్థ యొక్క దార్శనికతను పంచుకున్నారు.సృజనాత్మక పరిశ్రమలు మునుపెన్నడూ లేనంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి, మరియు విద్య ఇంకా వేగంగా అభివృద్ధి చెందాలన్నారు.. హ్యామ్‌స్టెక్‌లో, మా బాధ్యత సృజనాత్మక నైపుణ్యాలను బోధించడం వరకే పరిమితం కాదన్నారు. మేము సృజనాత్మకతను పెంపొందించే, సాంకేతికతను స్వీకరించే, వృత్తి అవకాశాలను వేగవంతం చేసే, పారిశ్రామికవేత్తలకు సాధికారత కల్పించే మరియు జీవితకాల అవకాశాలు నిరంతరం వృద్ధి చెందే ఒక పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నామనీ తెలిపారు. ఈ రోజు మేము ప్రకటించిన ప్రతి మైలురాయి, రేపటిని తీర్చిదిద్దే సృష్టికర్తలను తీర్చిదిద్దాలనే మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. రోజంతా నియామకదారులు వర్ధమాన ప్రతిభావంతులతో అనుసంధానమయ్యారు, పరిశ్రమల నాయకులు వర్ధమాన సృష్టికర్తలకు మార్గదర్శకత్వం వహించారు, తల్లిదండ్రులు విద్యార్థుల విజయాలను జరుపుకున్నారు మరియు వేలాది మంది సందర్శకులు హ్యామ్‌స్టెక్‌కు పర్యాయపదంగా మారిన అద్భుతమైన సృజనాత్మకతను అనుభవించారు. ప్రతి రన్‌వే ప్రదర్శన, ప్రతి ఎగ్జిబిషన్, ప్రతి ఇన్‌స్టాలేషన్ మరియు ప్రతి సంభాషణతో, హ్యామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026, వేలాది మంది విద్యార్థులకు వారి అభిరుచిని వృత్తిగా మరియు ఊహను ప్రభావంగా మార్చుకోవడానికి సాధికారత కల్పిస్తూ, సృజనాత్మక విద్య కోసం భారతదేశంలోని అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటిగా హ్యామ్‌స్టెక్ ఎందుకు కొనసాగుతుందో మరోసారి నిలిచిందని తెలిపారు.

## అంగన్వాడిలో నులిపురుగుల నివారణ మందు పంపిణీ

### నీటి తొట్టెల శుభ్రతపై ప్రత్యేక దృష్టి






ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 20: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కంబాపూర్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం నిర్వహించిన హాఫ్ డే కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సుజాత, ఆశా వర్కర్ నాగమణి పాల్గొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని నీటి తొట్టెలను సర్పంచ్ సుజాత శ్రావణ్ దేశాయ్ స్వయంగా పరిశీలించి శుభ్రం చేయించారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు.

# బీరప్ప ఆలయానికి స్థలం కేటాయింపు

### శివాలయంలో భక్తిశ్రద్ధలతో గుడి నింపుడు





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 20: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని ఎల్లమ్మ కుచ్చులో బీరప్ప ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. ఆలయ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్, రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, కుర్మా--గొల్లల సంఘ సభ్యులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అనంతరం సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ పిట్లం చెరువుకట్ట శివాలయంలో భక్తిశ్రద్ధలతో గుడి నింపుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఇంటి నుంచి నీటితో నింపిన బిందెలను తీసుకువచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ శేఖర్, ఆలయ పూజారి గంగాధర్ పంతులు ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల సుఖశాంతి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులకు పత్రాలు సమర్పించాలి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 20: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం లోని గ్రామపంచాయతీలలో చేయూత పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారులు అవసరమైన పత్రాల జిరాక్స్ ప్రతులను తమ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఎంపీడీవో సాయన్న తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పెన్షన్ దరఖాస్తు పత్రాల జిరాక్స్‌లను అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

## ప్రాథమిక ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ ప్రారంభం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 20: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మూడు రోజుల వృత్యాంతర శిక్షణ కార్యక్రమం సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. రెండు విడతల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో తెలుగు, ఆంగ్లం, గణితం అంశాలపై పరివర్తనాత్మక తరగతి గది అభ్యాసాల ద్వారా నాణ్యమైన అభ్యసనం లక్ష్యంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో వివిధ నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆర్పీలు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ వర్మ, శ్రీధర్ అంశాల వారీగా శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు, సీఆర్పీ హైమద్ పాషా పాల్గొన్నారు.

